https://vijayamdaily.com

# విజయం


పేజీలు : 08

• అక్షర సమరానికి నాంది..

ఖమ్మం | భద్రాద్రి | కొత్తగూడెం

సోమవారం / ఏప్రిల్17 / 2023

https://vijayamdaily.com





- ప్రజలే మమ్మల్ని గెలిపించి అసెంబ్లీకి పంపుతారు
- తెలంగాణ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- అభివృద్ధి, సంక్షేమాలపై విస్తృత ప్రచారం కల్పించాలి
- కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్
- ప్రజల మనిషి సీఎం కేసీఆర్ ను కాపాడుకునే బాధ్యత మనందరిపైనా ఉంది
- చీమలపాడు ఘటనలో మృతి చెందిన వారికి సంతాపం.. త్వరలోనే ప్రకటించిన రూ.10లక్షలు అందజేస్తాం.
- ఖమ్మం నగరం ఖానాపురం హవేలి డివిజన్ల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

**(ఖమ్మం ప్రతినిధి-విజయం న్యూస్)**

కాంట్రాక్ట్ పనుల కోసం పార్టీలు మారుతున్న ఓ నాయకుడు మంగమ్మ శపథాలు చేస్తుండటం హాస్యాస్పదమని, ఎవరు అసెంబ్లీ గేటును తాకలేరో శపథం సంగతి ప్రజలే చూసుకుంటారని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ పథకాలను గడపగడపకు తీసుకెళ్లే బాధ్యత బీఆరెస్ పార్టీ కార్యకర్తలపై ఉందని పువ్వాడ అజయ్ అన్నారు.

# అసెంబ్లీ గేటు ఎవరు తాకలేరో చూద్దాం..

## ఓ నాయకుడి మంగమ్మ శపథానికి ప్రజలు రియాక్షన్ ఇస్తారు



➢ వివరాలు 2లో..



### అన్ని కుల, మత సామరస్యానికి ప్రతీక

# బీఆర్ఎస్ ప్రభుత్వం..

- గత ఏడాది 5వేల తోఫా లు ఇవ్వగా.. ఈ సారి 6 వేల 700 గిఫ్ట్ ప్యాక్స్..
- నగరంలోని 37, 38, 39, 40వ డివిజన్ లలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తొఫా పంపిణీ చేసిన మంత్రి పువ్వాడ

**ఖమ్మం, ఏప్రిల్ 16(విజయం న్యూస్):** అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పేద ముస్లిం కుటుంబాలకు అందిస్తున్న రంజాన్ తోఫా లను మంత్రి ఆదివారం పంపిణీ చేశారు. నగరంలోని 42వ డివిజన్ నిజాంపేట, 40వ డివిజన్ శుక్రవారపేట, 39వ డివిజన్ మెదరి బజార్, 38వ డివిజన్ ఖిల్లా, 37వ డివిజన్ కస్బా బజార్ మజిద్ లలో ఆయా తొఫా లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో మత సామరస్యానికి ప్రతీకగా ప్రభుత్వం పండగలకు ప్రాధాన్యమిస్తూ ఆయా వర్గాల పేద ప్రజలకు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఏడాది 5 వేల గిఫ్ట్ ప్యాక్ ల పంపిణీ చేస్తుండగా, కానీ ఈసారి ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసి, మరో 1700 వందల గిఫ్ట్ ప్యాక్స్ ను తెచ్చుకుని మొత్తం 6700 గిఫ్ట్ ప్యాక్ లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

➢ వివరాలు 3లో..

### ప్రజలకు మెరుగైన

# సేవలందించాలి

- ప్రభుత్వాసుపత్రులపై నమ్మకం పెంచాలి
- ఖమ్మం ప్రభుత్వాసుపత్రిని పరిశీలించిన కలెక్టర్ వి.పి.గౌతమ్



**ఖమ్మం, ఏప్రిల్ 16(విజయం న్యూస్):** మెరుగైన సేవలు అందించి, ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. కలెక్టర్ శనివారం అర్ధరాత్రి జిల్లా ప్రధాన ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. మెటర్నిటీ లేబర్ రూమ్ ను సందర్శించి, డాక్టర్, సిబ్బంది విధులందు ఉన్నారా అని పరిశీలించారు. ఎన్ని కేసులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. క్యాజువాలిటి, ఐసియు లను పరిశీలించారు. డ్యూటీ డాక్టర్లు విధులందు ఉన్నది తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించి, ఎంతమంది ఇన్ పేషంట్లు ఉన్నది, రోజువారి ఓపి ఎంత ఉన్నది పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు ఎక్కువగా పేదవారు వస్తారని, వారికి సకాలంలో సరైన వైద్యం అందించాలన్నారు.

➢ వివరాలు 2లో..

### కార్పొరేట్ గుప్పెట్లో

# దేశ సంపద



- హక్కులను కాలరాస్తున్న బిజెపి
- ప్రజా సమస్యల పరిష్కారానికే పోరు యాత్ర
- పోరు యాత్రలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

**(ఖమ్మం అర్బన్-విజయం న్యూస్):** కార్పొరేట్ గుప్పెట్లో దేశ సంపద పోగుపడుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాస్తూ బిజెపి పాలన సాగిస్తుందని ఆయన తెలిపారు. సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు యాత్ర ఆదివారం రఘునాథపాలెం మండలంలో సాగింది. రఘునాథపాలెం మండలం బూడిదంపాడు వద్ద

➢ వివరాలు 3లో..

# అసెంబ్లీ గేటు ఎవరు తాకలేరో చూద్దాం

**మొదటి పేజీ తరువాయి..**



బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఖమ్మం నగరంలోని మొగిలి పాపిరెడ్డి ఫంక్షన్ హాల్ నందు జరిగిన ఖమ్మం కార్పొరేషన్ లోని ఖానాపూర్ హవేలి డివిజన్ల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత చీమలపాడు ఘటనలో మృతి చెందడం పట్ల వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు పాటు మౌనం పాటించి వారికి నివాళులు అర్పించారు. 60లక్షల సభ్యత్వం ఉన్న అతి పెద్ద పార్టీ బీఆర్ఎస్ అని, రాష్ట్రంలో గానీ కర్ణాటక, మహారాష్ట్ర లో మనను ఆదర్శంగా తీసుకుంటున్నారని అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం పాత కొత్త అనే తేడా లేకుండా కార్యకర్తలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోనే తెలంగాణ అభివృద్ధి చెందుతోందని.. సమైక్య పాలనలో నిరాదరణకు గురైన పల్లెలు నేడు అభివృద్ధిలో పరుగులు పెడుతున్నాయన్నారు. కార్యకర్త పార్టీకి వెన్నెముక లాంటి వాడని, వారి సంక్షేమం పార్టీ బాధ్యత అని అన్నారు. పార్టీ అభివృద్ధి కోసం కళ్ళల్లో ఒత్తులు వేసి కాపాడుకుంటున్న వారికి నేను అండగా ఉంటానని స్పష్టం చేశారు. మనం అధికారంలో ఉన్నాం కాబట్టి సహజంగానే ఉరుకుల పరుగులుగా మన రోజు గడిచిపోతుంది... అలాంటి సందర్భంలో నాయకులు, కార్యకర్తలు ప్రజలతో సంబంధాలు కోల్పోకుండా మన పని మనం చేసుకుంటూనే ప్రజలతో మంచి సంబంధాలు కొనసాగించాలని అందుకే పార్టీ అధినేత ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాల ద్వారా సూచించారు. ఖమ్మంలో ఒకాయన మన పార్టీని భూ స్థాపితం చేస్తామని మంగమ్మ శపదాలు చేస్తున్నారని, అలాంటి శపథాలు చాలా చూశామని, కేసీఆర్ ముందు ఇలాంటి అనేక మంగమ్మ శపథాలు భూస్థాపితం అయ్యాయని అన్నారు.అసెంబ్లీ గేట్ ను తాకనివ్వను అని శపథాలు చేస్తున్న వారికి చెప్తున్న నీ శపథాలు బూడిదలోపోసిన పన్నీరులా మారుతుంది అని అన్నారు. ప్రజలు కదా నన్ను అసెంబ్లీకి పంపేది.. ఈ అభివృద్ధిని చూసి కదా ప్రజలు మనలను అసెంబ్లీ కి పంపేది.. మనకేదో కడుపు నొప్పి కలిగింది అని బీఆర్ఎస్ పై విమర్శలు చేయడం సరైనది కాదన్నారు. నువ్వు అసెంబ్లీ కి పంపేది ఎంటి... ఆ అధికారం ప్రజలకు కదా ఉంది.. నగరంలో 4వేల మందికి ఉన్న చోటే ఇళ్ళకు జీవో నెంబర్ 58, 59 ద్వారా ఇళ్ళకు శాశ్వత పట్టాల మంజూరు, సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.20 కోట్లు, 30వేల మంది పెన్షన్లు, 30 వేల మంది తల్లులకు కేసీఆర్ కీట్స్, 8వేల మందికి కళ్యాణ లక్ష్మి, షాదిముభారక్ ద్వారా 76 కోట్లు పంపిణీ, దసరాకు బతుకమ్మ చీరలు, రంజాన్ కు తోఫా లు, క్రిస్మస్ కు కానుకలు ఇలా అనేక సంక్షేమ పథకాలు అందుకుని, మన అభివృద్ధిని చూసిన ప్రజలే మనలను అసెంబ్లీ కి పంపిస్తానని తెలుసుకోవాలన్నారు. ప్రజలకు మంచి పని చేసే నాయకుడు తీపి గుళికలు లాగా ఉంటారని, కేవలం అప్పుడప్పుడు కనిపించే వాళ్ళను చేదు గుళికలు లాగానే చూస్తారని గుర్తు చేశారు. కరోనా సమయంలో చెప్పులు అరిగేలా అన్ని జోన్ లకు, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న చోటకు కూడా వెళ్లి వాళ్ళను పరామర్శించి, వారికి నిత్యావసర సరుకులు, ట్యాంకర్ల ద్వారా ఆక్సీజన్ అందుబాటులో ఉంచి, అవసరం అయినన్ని బెడ్లు ఉంచి మన బిడ్డలను కాపాడుకున్నమని వారే నన్ను అసెంబ్లీకి పంపుతారు ధీమా వ్యక్తం చేశారు. ఎక్కడి.. ఎక్కడి నుండో వచ్చి ఖమ్మంను చూసి ఇది ఖమ్మమేనా అని కొనియాడినందుకేనా మాపై మీకు కళ్ళు కుట్టినయా అని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్చుకోలేకనే ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణకు నయాపైసా ఇవ్వని వారు కూడా తెలంగాణ గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మాయ మాటలతో తెలంగాణను ఆగం పట్టియ్యాలని చూస్తున్న బీజేపీ, కాంగ్రెస్ ను ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ ను కాపాడుకునే బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. మొన్న చీమలపాడు లో జరిగిన ఘటన అత్యంత భాదాకరమన్నరు. వారి కుటుంబాలను ఆదుకుంటామని స్పష్టం చేశారు. వారికి ప్రకటించిన రూ.10 లక్షలు అతి త్వరలోనే వారి కుటుంబాలకు అందజేసి వారిని ఆదుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో బాగంగా సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలకు మంత్రి పువ్వాడ స్వయంగా వడ్డించిన అనంతరం వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, ఏఎంసి చైర్ పర్సన్ దోరెపల్లి శ్వేత, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్జేసీ క్రిష్ణ, ఖమ్మం నగర కమిటీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు కర్నాటి క్రిష్ణ, కమర్తపు మురళీ, పాకాలపాటి విజయనిర్మల, మదురి ప్రసాద్, దాదే అమృతమ్మ, ఆలియా షౌకత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.



# చీమలపాడు ఘటనలో కాలు కోల్పోయిన హెడ్ కానిస్టేబుల్ నవీన్‌కు పొంగులేటి పరామర్శ



**(ఖమ్మం-విజయం న్యూస్):**

ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మంజిల్లాలో ఆదివారం పర్యటించారు. పర్యటనలో భాగంగా చీమలపాడు ఘటనలో కాలు కోల్పోయి ఖమ్మం నగరంలోని సంకల్ప ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హెడ్ కానిస్టేబుల్ నవీన్ ను పరామర్శించి ఓదార్చారు. గాయాలబారి నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఖమ్మం నగరంలోని పలు డివిజన్లలో పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. పలు శుభకార్యక్రమాల్లో పాల్గొన్నారు. చింతకాని మండలంలో పలు కుటుంబాలను పరామర్శించారు. పలు శుభకార్యక్రమాల్లో పాల్గొని నూతన వస్త్రాలను కానుకగా అందించారు. అదేవిధంగా బోనకల్ మండలంలోని చిన్నబీరవల్లిలో జరిగిన బొడ్రాయి మొదటి వార్షికోత్సవ వేడుకలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలు గ్రామంలోని తిరుపతమ్మ దేవస్థానంలో జరిగిన బత్తుల వెంకట్రావు మొక్కు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో పొంగులేటి ని సత్కరించారు. ప్రజల అభిరుచికి అనుగుణంగానే తన భవిష్యత్తు రాజకీయ నిర్ణయం ఉంటుందని ఈ సందర్భంగా స్థానిక మీడియాకు పొంగులేటి వెల్లడించారు.

# పేదలకు అండగా నిలుస్తున్న జీళ్ళచెరువు టీడీపీ



**(కూసుమంచి-విజయంన్యూస్)**

కూసుమంచి మండలంలోని జీళ్ళచెరువు గ్రామానికి చెందిన తెలుగుదేశం గ్రామశాఖ పేదలకు అండగా నిలుస్తోంది. పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పెంద్ర రమేష్ ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన తెలుగుదేశం పార్టీ గత కొద్ది రోజులుగా పేదలకు చేయూతనందిస్తున్నారు. ఇటీవలే గుండెపోటుతో మరణించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త మొక్క ఉపేందర్(వజీర్ ఉపేందర్)కు పార్టీ నాయకులు ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆదుకున్నారు. అర్థిక చేయూతతో పాటు బియ్యంను అందజేశారు. అలాగే ఆదివారం అదే గ్రామంలోని నిరుపేద కుటుంబానికి అరకింట బియ్యాన్ని అందజేశారు. దీంతో తెలుగుదేశం పార్టీ చేస్తున్న సేవా కార్యక్రమాలను గ్రామస్థులు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అయితగాని భూషయ్య, ఐతగాని కాశీలు, చిన్న పొంగు వెంకన్న, గోపి లక్ష్మణ్, గోపి శంకర్, అంబాల వీరబాబు తదితరులు హాజరైయ్యారు.





# ప్రజలకు మెరుగైన సేవలను అందించాలి

**మొదటి పేజీ తరువాయి..**

ప్రభుత్వం నిధులు వెచ్చించి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నదని, అన్ని రకాల పరీక్షలు ఉచితంగా అందిస్తున్నదని, వైద్యులను అందుబాటులో ఉంచినట్లు ఆయన అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సేవలు రోగులకు అవగాహన కల్పించాలన్నారు. విధులు సక్రమంగా నిర్వర్తిస్తు, రోగుల పట్ల వైద్యులు మానవతదృక్పథంతో మెలగాలన్నారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా డ్యూటీ డాక్టర్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పేదల పాలిట ఆపద్భాందవుడు
# కేసీఆర్ మంత్రి పువ్వాడ

### నగరంలోని 4,5,6, 55, 56వ డివిజన్ పేదలకు మొత్తం 175 పట్టాలు పంపిణీ చేసిన మంత్రి పువ్వాడ



(ఖమ్మం ప్రతినిధి-విజయం న్యూస్)

పేదల కష్టాలు ఎరిగిన వాడే నిజమైన నాయకుడు అని, కనీసం గుడు లేని పేదలు గుడిసెలు వేసుకున్న వారికి శాశ్వత భద్రత కల్పించేందుకు జీవో 58 కింద ఇండ్ల పట్టాల పంపిణీ చేసిన సీఎం కేసీఆర్ పేదల ఆపద్బాంధవుడు అని రవాణా శాఖ మంత్రి పువ్వాడ కుమార్ అన్నారు. నగరంలోని 55వ డివిజన్ వేణు గోపాల్ నగర్ నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ జీవో 58%ట%59 పట్టాలను పంపిణీ చేశారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 4,5,6, 55, 56వ డివిజన్లలో పేదలు ధరఖాస్తు చేసుకుని మంజూరైన 175-పట్టాలను





మంత్రి పువ్వాడ స్వయంగా పంపిణీ చేశారు. ప్రభుత్వ స్థలాల్లో పేదాలు ఏళ్లుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్న వారికి అక్కడే ఆ స్థలం వారికే చెందేదిగా ఈ పథకం ద్వారా శాశ్వత పట్టాలను పంపిణీ చేశారు. సంక్షేమ పథకాల్లో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా ఉందన్నారు. ఏండ్ల నాటి పేదల కలలను జీవో 58, 59లతో సీఎం కేసీఆర్ పేదల కల సాకారం చేశారని, పేదలకు స్థలాలు క్రమబద్ధీకరణ చేయడం గొప్ప విషయమని చెప్పారు. పేదలకు పట్టాలు ఇవ్వడంతో వారిలో ధైర్యం పెరిగిందన్నారు. ప్రభుత్వం పేదలకు పింఛన్లు, కళ్యాణలక్ష్మి, షాదీముబరక్, రైతుబంధు, రైతు బీమా తదితర పథకాలతో పేద, మధ్యతరగతి ప్రజలకు సీఎం కేసీఆర్ ఎంతో మేలు చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ 58 జీవో కింద అందించిన పట్టాలతో ఇండ్లపై పూర్తి హక్కులు వచ్చాయని, గతంలో పూర్తి స్థాయిలో ఇంటిపై హక్కులు లేక ఇబ్బందులు పడ్డారని, నిరుపేదలకు పెద్దన్న సీఎం కేసీఆర్ గారు అని ప్రభుత్వ స్థలంలో గృహాన్ని నిర్మించుకున్నా సరైన పత్రాలు లేక ఇబ్బందులు పడటాన్ని గుర్తించి ఈ పథకంను తీసుకొచ్చారు అని అన్నారు. ఈ పథకం ద్వారా సీఎం కేసీఆర్ పట్టలు ఇవ్వడంతో చాలా సంతోషంగా ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూధన్, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్, కార్పొరేటర్లు దండా జ్యోతి రెడ్డి, నాగండ్ల కోటి, మోతారపు శ్రావణి సుధాకర్, పైడిపల్లి రోహిణి సత్యనారాయణ, ఆర్డీవో రవీంద్రనాథ్, తహసిల్దార్ శైలజ తదితరులు ఉన్నారు.

# 27 నుండి ఖమ్మంలో శ్రీఅఖిలాండ కోటి అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం

(ఖమ్మం ప్రతినిధి-విజయం న్యూస్)

ఖమ్మం నగరంలోని టేకులపల్లిలో కౌతారపు సుబ్రహ్మణ్యం - సునంద కుమారిల పర్యవేక్షణలో ఈనెల 27 నుండి 49 రోజులపాటు శ్రీ శ్రీఅఖిలాండ అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వాడు ఖమ్మలలో ఈ కార్యక్రమానికి సంబందించిన ప్రచార కరపత్రాలను వారు ఆవిష్కరించారు. అనంతరం పూజ్యశ్రీ రామ్ గురువు మాట్లాడుతూ లోకకళ్యాణం కోసం ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 27న ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం జూన్ 15 వరకు కొనసాగుతుందని చెప్పారు. ఈనెల 27న



విఘ్నేశ్వరపూజ, కలశస్థాపన, నవగ్రహ మండప ఆరాధన, బాబావారికి అభిషేకం, విశేష అర్చనలతో ప్రారంభమై హెూమాలు, సంకీర్తనలు, భజనలు, పారాయణాలతో సాగుతుందని చెప్పారు. జూన్ 18న జరిగే పూర్ణాహుతితో ఈ కార్యక్రమం పరిసమాప్తి అవుతుందన్నారు. రామసీతమ్మ హరిప్రసాదరావుల ఆశీస్సులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా 52.53 అధ్యాయాలు కలుపుకుంటూ 51 అద్యాయాల పారాయణం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం పూజ్యశ్రీ రామ్ జీ గురువు వారి సారధ్యంలో జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బొమ్మా విద్యాసంస్థల అధినేత బొమ్మా రాజేశ్వరరావు, స్థానిక 7వ డివిజన్ కార్పొరేటర్ దొంగల సత్యనారాయ, రవీంద్ర, జల్లేపల్లి రమేష్, గంగాధర్ ప్రసాద్, కె గణేష్ కుమార్, యర్రా రమేష్, కమర్తపు గోపాలరావు, నిర్వాహకులు సుబ్రహ్మణం, సునంద కుమారి తదితరులు పాల్గొన్నారు.

# అన్ని కుల, మత సామరస్యానికి ప్రతీక బీఆర్ఎస్ ప్రభుత్వం..

మొదటి పేజీ తరువాయి..



వీటితో పాటు పువ్వాడ ఫౌండేషన్ తరుపున 6700 సేమియా, చక్కెర, డ్రై ఫ్రూట్స్ కిట్స్ ను కూడా పంపిణీ చేస్తున్నామని ఆయన వివరించారు. ఈ రంజాన్ గిఫ్ట్ ప్యాక్ లో చీర, బ్లౌజ్, పంజాబి డ్రెస్ మెటీరియల్, లాల్చీ, పైజమా క్లాత్ ఉంటుందన్నారు. ప్రతి పేదవారు పండుగను సంతోషంగా జరుపుకోవాలని ప్రభుత్వ అభిమతమని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం హిందువులకు బతుకమ్మ పండుగకు చీరల పంపిణీ, క్రిస్మస్ సందర్భంగా క్రిస్టియన్లకు, ముస్లింలకు రంజాన్ పండుగను పురస్కరించుకుని పేద ప్రజానీకానికి రంజాన్ కానుక అందించడం జరుగుతుందని అన్నారు. అన్ని వర్గాలకు ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. పండగలు అనేవి సంతోషంగా సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని అన్నారు. అయితే పండుగల వేళ నిరుపేద ప్రజానీకం నూతన వస్త్రాలు తెచ్చుకునే పరిస్థితి లేకపోవడం గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆయా వర్గాల ప్రజలకు పండగ వేళ బట్టల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పండుగను సోదరభావంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సవాల మధ్య కుటుంబ సమేతంగా జరుపుకోవాలని మంత్రి పువ్వాడ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, ఏఎంసి చైర్ పర్సన్ దోరెపల్లి శ్వేత, కార్పొరేటర్లు పాకాలపాటి విజయనిర్మల, మదురి ప్రసాద్, దాదే ఆమృతమ్మ, ఆలియా షౌకత్ అలీ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమూది, ఖమ్మం అర్బన్ తహసిల్దార్ శైలజ, మైనారిటీ నాయకులు తాజోద్దీన్, ఖమర్, ముక్తార్, సలీం, ముజాహిద్, తౌసిఫ్, షంశుద్దిన్, మదురి సైదారావు, మెహబూబ్ అలీ, శేషగిరిరావు, దాదే సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## ఇఫ్తార్‌లో పాల్గొన్న మంత్రి పువ్వాడ..

(ఖమ్మం ప్రతినిధి-విజయం న్యూస్)

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఖమ్మం నగరంలోని 40వ డివిజన్ శుక్రవారపేటలోని మజీద్- ఏ ఇస్టాబల్ నందు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపవాసం ఆచరిస్తున్న ముస్లిం సోదరులకు ఖజ్జూరాలు, పండ్లు తినిపించి ఈరోజు దీక్షను విరమింపజేశారు. అనంతరం వారితో పాటు మంత్రి పువ్వాడ నమాజును ఆచరించి, దువా చేశారు. మజీద్ కమిటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ లో మెహబూబ్ అలీ, తాజ్ ఉద్దీన్, షంశుద్దిన్, సలీం, టీపు, దాదే సతీష్, అసిఫ్, సాద్, జాని, అలిం, అబ్బాస్ అలీ, తాజ్ఉద్దీన్, ఆశ్రిఫ్, తదితరులు ఉన్నారు.



## కార్పొరేట్ గుప్పెట్లో దేశ సంపద

మొదటి పేజీ తరువాయి..

సిపిఐ శ్రేణులు ప్రజాపోరు యాత్రకు ఘన స్వాగతం పలికారు. మండల పరిధిలోని బూడిదంపాడు, మంచుకొండ, ఈర్లపుడి, చింతగుర్తి, వి.వెంకటాయపాలెం గ్రామాల్లో యాత్ర సాగింది. పోరు యాత్రకు బూడిదంపాడు, చింతగుర్తి సర్పంచులు మీరాసాహెబ్, మెంటం రామారావు, సిపిఎం మండల కార్యదర్శి ఎస్. నవీన్ రెడ్డి సంఘీభావం తెలిపారు. పోరు యాత్రలో భాగంగా ఆయా గ్రామాలలో పార్టీ జెండాలను జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా ఆవిష్కరించారు. వి.వెంకటాయపాలెంలో అమర వీరుల స్తూపాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో పోటు ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, బిజెపికో హఠావో - దేశ్కు బచావో అనే నినాదతో సిపిఐ ఆధ్వర్యంలో ప్రజాపోరు యాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని తెలిపారు. పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాస్తుందని తెలిపారు. మతపరమైన విషయాలను రాజకీయాల్లోకి తీసుకు వచ్చి లబ్ది పొందెందుకు యత్నిస్తుందన్నారు. ఆర్థిక అంతరాలు పెరిగి సంపన్నులు మరింత సంపన్నులుగా మారుతున్నారన్నారు. బిజెపిని గద్దె దించడమే లక్ష్యంగా వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తుల ఐక్యతకు సిపిఐ కృషి చేస్తుందన్నారు. మతోన్మాద బిజెపిని తెలంగాణ రాష్ట్రంలోకి రానివ్వకుండా అడ్డుకునేందుకు వామపక్షాలు బిఆర్ఎస్ పార్టీతో కలిసి పని చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలిపారు. రుణమాఫీ, డబుల్బెడ్రూం ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, పోడు భూములకు పట్టాలు, రైతులకు గిట్టుబాటు ధర మొదలగు హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. ఈ పోరు యాత్రలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, ఎస్కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి, తోట రామాంజనేయులు, తాటి వెంకటేశ్వర్లు, రావి శివరామకృష్ణ, పగడాల మల్లేష్, తాటి నిర్మల, గాదె లక్ష్మీ నారాయణ, ఏనుగు గాంధీ, యానాలి సాంబశివరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు, నాయకులు బాగం మాధవరావు, బాగం ప్రసాద్, సురభి శ్రీను, కురువెళ్ల వెంకయ్య, పల్లెలపాటి నాగేశ్వరరావు, ప్రొద్దుటూరు వెంకటరెడ్డి, జూలా వెంకటేశ్వర్లు, రావెళ్ల సురేష్, శివరామకృష్ణ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శులు నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయానికి విజ్ఞాన పుస్తకాలు అందజేత

**తల్లాడ ఏప్రిల్ 16 (విజయం న్యూస్)**

తల్లాడలోని గ్రంథాలయానికి విజ్ఞాన పుస్తకాలను ఆదివారం అందించారు. తల్లాడ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ ప్రచార కార్యదర్శి తేళ్ళూరి రఘు ఆధ్వర్యంలో రాయల తిరుమలయ్య దగ్గర ఉన్న విజ్ఞాన పుస్తకాలను దాతగా సేకరించి గ్రంథాలయానికి అందించారు. నిరుద్యోగులకు కావలసిన సిలబస్ లతోపాటు అన్ని రకాల విజ్ఞాన అన్ని పెంపొందించే పుస్తకాలను అందించారు. వీటిని గ్రంథాలయ పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు తొండపు రామకృష్ణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## హెడ్ కానిస్టేబుల్‌కు అండగా ఉంటాం

### - చీమలపాడు ఘటనలో క్షతగాత్రుడైన హెడ్ కానిస్టేబుల్ ను పరామర్శించిన పువ్వాడ..

**(ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)**

ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం చీమలపాడు అగ్నిప్రమాద ఘటనలో క్షతగాత్రుడై కాలు కోల్పోయి సంకల్ప ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హేడ్ కానిస్టేబుల్ దావా నవీన్ ను రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కలిసి పరామర్శించారు. ఏమి అధైర్య పడొద్దు అని, వారికి ధైర్యం కల్పించారు. పూర్తిగా కోలుకునే వరకు అన్ని రకాల వైద్య చికిత్సలు అందిస్తామని, ధైర్యం కోల్పోవొద్దు ధైర్యం చెప్పారు. ఇప్పటికే శాఖ మంత్రి, పోలీస్ కమిషనర్ తో మాట్లాడామని ప్రభుత్వం తరుపున పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి వైద్య సేవలైన తక్షణమే అందించాలని, పూర్తిగా కోలుకునేవరకు మెరుగైన చికిత్సలను అందించాలని వైద్యులకు సూచించారు. ఏమి అధైర్య పడొద్దు అని, వారి కుటుంబానికి ధైర్యం కల్పించారు. పూర్తిగా కోలుకునే వరకు అన్ని రకాల వైద్య చికిత్సలు ప్రభుత్వం తరపునే ఉచితంగా అందిస్తామని, ధైర్యం కోల్పోవొద్దు ధైర్యం చెప్పారు.ఎలాంటి వైద్య సేవలైన తక్షణమే అందించాలని, పూర్తిగా కోలుకునేవరకు మెరుగైన చికిత్సలను అందించాలని వైద్యులను మంత్రి పువ్వాడ అదేశించారు

# తెలంగాణ గడ్డపై కాషాయపు జెండా ఎగరాలి

### బిజెపి జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ

**తల్లాడ ఏప్రిల్ 16 (విజయం న్యూస్)**

భారతీయ జనతా పార్టీ తల్లాడ మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు ఆపతి వెంకట రామారావు అధ్యక్షతన తల్లాడలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ పాల్గొని మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పార్టీని భూత్ స్థాయిలో పటిష్ట పరిచే స్థితిలో పార్టీ పనిచేస్తుందని అన్నారు, జిల్లాలో గ్రామ గ్రామాన భాజపాలోకి పెద్ద సంఖ్యలో యువత, రైతులు మహిళలు అన్ని సామాజిక వర్గాల నుండి పార్టీలో చేరుతున్నారని తెలిపారు, వారి చేరికలే రేపు జిల్లాలో పార్టీకి గెలుపుకు నాంది అని అన్నారు, త్వరలో జిల్లాలో రాజకీయంగా అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటాయని అన్నారు జిల్లాలో భాజపాయే పెద్ద శక్తిగా ఎదిగి జిల్లాలో అన్ని స్థానాల్లో కాషాయపు జెండా ఎగురవేస్తామని అన్నారు, జిల్లాలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ బిజెపి అని తెలిపారు, రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు జరిగిన అన్యాయానికి నిరసనగా త్వరలోనే ఖమ్మం జిల్లాలో రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ నిరుద్యోగ మార్చి ఉంటుందని ఈ కార్యక్రమంలో నిరుద్యోగ యువత అంతా పాల్గొనాలనిరాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని నిరుద్యోగ యువతకువిజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వానిది పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఉందని అన్నారు, అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇస్తానన్న ప్రభుత్వం ఇంతవరకు ఆ ఊసే లేదని అన్నారు తక్షణమే నష్టపోయిన రైతులందరకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు, జిల్లాలో ఓవైపు యాసంగి వరి పంట కోసి కల్లాలలో రైతులు వడ్లు ఉంటే ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని అన్నారు, అట్లాగే మొక్కజొన్న రైతులు పంట కూడా చేతికొచ్చి కళ్ళల్లో ఉన్నాయని అన్నారు,కానీ ప్రభుత్వం నేటికీ కొనుగోలు కేంద్రాలు తెరవక మధ్య దళారీలకు అలవ సులవగా అమ్ముతున్నారని అన్నారు, వెంటనే ప్రభుత్వం స్పందించి మార్క్ ఫైట్ ద్వారా కొనుగోలు చేసేందుకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను, వడ్ల కొనుగోలు కేంద్రాలను తెరవాలని తెలిపారు, అట్లాగే తల్లాడ మండలంలోని సిరిపురం మేజర్ ఆయకట్టు కింద వేసినటువంటి వరి పంట చేతికందేంతవరకు ఈ నెలాఖరు వరకు నీటి సరఫరా చేసి పంటను రైతు చేతికి వచ్చేంతవరకు కాపాడాలని తెలిపారు, ఈ విషయాలపై రైతులకు న్యాయం జరిగే వరకు రైతుల తరఫున భాజాప అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆపతి వెంకట రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రాథోడ్,జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి విష్ణు కాంత్,జిల్లా నాయకులు నెల్లూరు కోటేశ్వరరావు, దార్ల శంకర్ గౌడ్, దుద్దుకూరి కార్తీక్ ,గాదే కృష్ణారావ గొల్లమండల నరేష్ ,రాయల రమేష్ కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# విజయ డెయిరీని ప్రైవేట్ పరం చేసే ఆలోచన లేదు

### - విజయ డెయిరీ డీడీ డాక్టర్ కుమారస్వామి

**ఖమ్మం, ఏప్రిల్ 16(విజయం న్యూస్):**

ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఖమ్మం విజయా డెయిరీని ప్రయివేటుపరం చేసే ఆలోచన యాజమాన్యానికి లేదని, పాడి రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని విజయా డెయిరీ డిడి డా. కుమారస్వామి అన్నారు. ప్రయివేటు డెయిరీలకు దీటుగా 1 ఏప్రిల్, 2023 నుండి పాల సేకరణ ధరలు పెంచినట్లు, దీంతో కొంతమంది స్వార్థపరులు ప్రభుత్వ విజయా డెయిరీపై అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, వీటిని నమ్మవద్దని ఆయన తెలిపారు. ప్రభుత్వ విజయా డెయిరీ యాజమాన్యం పాడిరైతుల సొసైటీలను పటిష్ట పరుచుటకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నదని, ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో విజయా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలను ఏర్పాటుచేసి, ప్రభుత్వ విజయా డెయిరీని బలోపేతం చేసే దిశగా యాజమాన్యం దృష్టి సారించిందని ఆయన అన్నారు. పాడిరైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండడంతో పాటు, ముద్ర లోన్ ల ద్వారా పాడి గేదెలు, రాయితీపై ఔషధాలు, పశుగ్రాసం విత్తనాలు, ఉచిత వైద్య సేవలు, విజయా డెయిరీ సంక్షేమ పథకాలను పాడి రైతులకు అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. పాడి రైతులకు పారదర్శకంగా ఉండటం, లబ్ధి చేకూర్చడం కొరకు పాలమిత్ర మొబైల్ యాప్ ద్వారా డైరెక్ట్ బెనిఫిషియరి ట్రాన్స్ఫర్ తో నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో పాల బిల్లులు జమచేయుటకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అవాస్తవాల ప్రచారాలను నమ్మవద్దని, పాడిరైతులు ఆందోళన చెందవద్దని విజయా డెయిరీ డిడి స్పష్టం చేశారు.



## గుర్వాయిగూడెంలో బీజేపీలోకి చేరికలు

**(కూసుమంచి-విజయం న్యూస్)**

పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలంలో గల గుర్వాయిగూడెం గ్రామంలో శక్తి కేంద్ర ఇంచార్జి మంద చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వశక్తి కరణ సందర్భంగా బూత్ కమిటీ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు గడ్డం. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2023లో బిజెపి రావటం ఖాయమని ప్రతి గ్రామంలో బిజెపిలో చేరిక నడుస్తున్నాయని బండి సంజయ్ అన్న ఆధ్వర్యంలో 2023 ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారం రాబోతుందని కనుక మనమంతా కలిసికట్టుగా పనిచేసే పాలేరులో బిజెపిని గెలిపించాలని అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని వివిధ పార్టీల నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బిజెపి పార్టీలో చేరడం జరిగినది. బి నర్సిరెడ్డి, చీమల సుధాకర్ రెడ్డి, కే వీరబాబు, ఎన్ లింగారెడ్డి, ఆర్ కిరణ్ రెడ్డి, బి జనార్దన్ రెడ్డి, బి రమణారెడ్డి,. ఆర్ సురేందర్ రెడ్డి, బి శ్రీనివాస్ రెడ్డి, బి శేఖర్ రెడ్డి, మొదలైన వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

# రైతుల మేలుకోసమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

### పాలేరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన పాలేరు ఎమ్మెల్యే



**(కూసుమంచి-విజయంన్యూస్)**

రైతుల మేలు కోసమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నదని, నాణ్యమైన ధాన్యాన్ని తెచ్చి మద్దతు ధర పొందాలని, కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు. కూసుమంచి మండలంలోని పాలేరు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఆహార ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. దాన్యం కొనుగోలు చేయాల్సిన ఎఫ్సిఐ కేంద్ర ప్రభుత్వంలో ఆధీనంలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని, కేంద్ర ప్రభుత్వ వివక్షతను చూపుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బానోతు శ్రీనివాస్ నాయక్, ఆత్మ కమిటీ చైర్మన్ రామసహాయం బాలక్రిష్ణారెడ్డి, రైతు సమితి అధ్యక్షుడు బానోతు రాంకుమార్, డీసీసీబీ డైరెక్టర్ శేఖర్, సర్పంచ్ యడవల్లి మంగమ్మ, ఐకేపీ ఏపీఎం, పంచాయతీ కార్యదర్శి తదితరులు హాజరైయ్యారు.

